బుధవారం 31-07-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 410 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616

email: mundadugu111@gmail.com



# వయనాడ్.. కన్నీటి వరద

వయనాడ్ మాటలకందని ప్రళయం.. నేలమట్టమైన గ్రామాలు.. వరదలో కొట్టుకుపోయిన ప్రాణాలు.. సహాయక బృందాలు కూడా తల్లడిల్లిన సంఘటన కేరళలోని వయనాడ్‌లో జరిగింది. కేరళలో కురుస్తున్న భారీ వర్షా లు ఊహకందని పెను విషాదంగా మారింది.

- తలలేని మొండాలు.. కొట్టుకుపోతున్న శవాలు
- వరదలో కొట్టుకొస్తున్న కాళ్లు, చేతులు
- గ్రామాలకు గ్రామాలే నేలమట్టం
- బురద, వరద నీటిలో చిక్కుకున్న ప్రజలు

02



ఝార్ఖండ్‌లో
## రైలు ప్రమాదం

మిగతా 2లో



భారత్ ఖాతాలో
## మరో పతకం

మిగతా 3లో



## మహిళలపై ఆగని అఘాయిత్యాలు

మిగతా 4లో





## వీధికో ప్రయివేట్ ఆసుపత్రి..!


మిగతా 5లో

# రాష్ట్రంలోని రైతుల ఇళ్లల్లో పండుగ రోజు

- రూ.లక్షన్నర ఉన్న రైతు రుణాలన్నీ మాఫీ
- రెండో విడతగా రూ.6,190 కోట్లు జమ
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి




02



# పెన్షన్ జాప్యంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

## కేంద్రానికి రూ.2 లక్షల జరిమానా

ముందడుగు జాతీయం:

'వన్ ర్యాంక్ వన్ పెన్షన్' పథకం ప్రకారం పింఛను చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని, భారత సైన్యంలో రిటైర్డ్ రెగ్యులర్ కెప్టెన్లకు చెల్లించే పెన్షన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకోకపోవడంపై భారత సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కేంద్రానికి రూ.2 లక్షల జరిమానా విధించింది. ప్రభుత్వానికి చివరి అవకాశం ఇచ్చిన సర్వోన్నత న్యాయస్థానం..

మిగతా 2లో

ముందడుగు
బుధవారం, 31-07-2024, హైదరాబాద్

# వయనాడ్.. కన్నీటి వరద

ముందడుగు కేరళ:

కేరళలో కురుస్తున్న భారీ వర్షా ల కారణంగా వయనాడ్ జిల్లాను వరదలు ముంచెత్తాయి. ఈ వరదల వల్ల కొండచరియలు విరిగిపడటం, బురద కొట్టుకురావడంతో 80 మంది జల సమాధి అయ్యారు. ఇప్పటివరకూ 80 మంది మృతదేహాలు దొరికినట్లు కేరళ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ వి.వేణు ప్రకటించారు. 116 మంది తీవ్ర గాయాలపాలై వయనాడ్ జిల్లాలోని పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వందల మంది వరదల్లో గల్లంతయ్యారు. ఈ జల ప్రళయం కేరళను అల్లకల్లోలం చేసింది. జులై 30న అర్ధరాత్రి సమయంలో వయనాడ్ జిల్లాలో ఊళ్లకు ఊళ్లు కొండచరియలు, బురద, వరద నీటిలో చిక్కుకుపోయాయి.



వయనాడ్ జిల్లా ఇలా శోకసంద్రంలో మునిగిపోవడం చూసి నెటిజన్లు హృదయవిదారక స్థితిలో స్పందిస్తున్నారు. కేరళలోనే వయనాడ్ జిల్లా అత్యంత సుందరమైన ప్రదేశం. సందర్శకులు వయనాడ్ అందాలను వీక్షించేందుకు భారీగా వెళుతుంటారు. అలాంటి ప్రాంతాలైన వయనాడ్‌లోని ముండక్కై, చూరల్మల, అట్టమాల, నూల్పూజ గ్రామాలు ప్రస్తుతం విషాదానికి సాక్ష్యాలుగా మిగిలాయి. మళప్పురంలోని చలియార్ నదిలో 11 మంది మృతదేహాలు కొట్టుకొచ్చాయి. కాళ్లు లేని స్థితిలో, చేతులు లేని స్థితిలో, మరికొందరి మృతదేహాలైతే తల లేకుండా మొండెం మాత్రమే నదిలోకి కొట్టుకొచ్చిందంటే ప్రకృతి ఉగ్రరూపం ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నదిలోకి కొట్టుకొచ్చిన ఈ 11 మంది మృతదేహాల్లో మూడేళ్ల చిన్నారి కూడా ఉండటం శోచనీయం. వయనాడ్ జిల్లా మాత్రమే కాదు భారీ వర్షా లు కేరళ రాష్ట్రం మొత్తాన్ని అతలాకుతలం చేశాయి. కేరళలోని 8 జిల్లాలకు భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. వయనాడ్ జిల్లాలో వరదలకు బలైపోయిన బాధితులకు సంతాప సూచికగా జులై 30, 31.. ఈ రెండు రోజులను కేరళ ప్రభుత్వం సంతాప దినాలుగా ప్రకటించింది. కేరళకు వెళ్లే పలు రైళ్లు వరదల కారణంగా తాత్కాలికంగా రద్దు చేశారు. 17 రైళ్లను రీషెడ్యూల్ చేశారు.

ఇడుక్కి, త్రిసూర్, పాలక్కడ్, మళ్లపురం, కోజికోడ్, వయనాడ్, కన్నూర్, కాసరగోడ్.. ఈ 8 జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షా లు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. ముండక్కై అనే గ్రామం గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. ఇళ్లు కూలిపోయాయి. భారీ చెట్లు నేలకొరిగాయి.


వాహనాలు కొట్టుకుపోయాయి. ఎక్కడ చూసినా కొండ చరియలు సృష్టించిన భయానక పరిస్థితులే కళ్ల ముందు కనిపిస్తున్నాయి. అర్ధరాత్రి అందరూ నిద్రిస్తుండగా, 2 నుంచి 4 గంటల మధ్యలో వయనాడ్ జిల్లాపై కొండచరియలు విరుచుకుపడ్డాయి. మెప్పాడిలో 250 మంది వరదల్లో చిక్కుకుపోయారు. వర్షం పడుతూనే ఉండటంతో సహాయక బృందాలకు ఇబ్బందిగా మారింది. 200 మంది సైనికులు సహాయక చర్యల్లో భాగమయ్యారు.

# రాష్ట్రంలోని రైతుల ఇళ్లల్లో పండుగ రోజు

ముందడుగు తెలంగాణ:

రైతు అభివృద్ధి, రైతు ప్రయోజనాలే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రధానమని, అందుకు రైతు బతుకుల్లో ఆనందం కోసమే రుణమాఫీ చేశామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కార్పొరేట్ సంస్థల అధిపతులు బ్యాంకులను మోసం చేస్తున్నారన్న ఆయన గత పదేళ్లలో కార్పొరేట్ కంపెనీలు రూ.14 లక్షల కోట్లు ఎగవేశాయని చెప్పారు. కానీ, సాగుకోసం బ్యాంకుల నుంచి తెచ్చిన అప్పులు తిరిగి కట్టలేక రైతులు నానా అవస్థలు పడుతున్నారని అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం వాళ్ల రుణాలను మాఫీ చేస్తోందని చెప్పారు.

రెండో విడత పంట రుణాల మాఫీ నిధుల విడుదల సందర్భంగా శాసనసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రేవంత్ మాట్లాడారు. గతంలో అనేక మంది రైతులు సొంత పొలంలోనే పురుగుల మందు తాగి ప్రాణాలు కోల్పోయారు. ఏ రైతు కూడా




ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోకూడదనేదే మా విధానం. అందుకే మంగళవారం రూ. లక్షన్నర వరకు ఉన్న రైతు రుణాలన్నీ మాఫీ చేశాం. రాష్ట్రంలోని రైతులందరి ఇళ్లల్లో మంగళవారం పండుగ రోజు. సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేశాం. రెండో విడతగా రూ.6,190 కోట్లు మాఫీ చేశామని అన్నారు. రుణమాఫీ కింద సుమారు 6.4 లక్షల మంది రైతుల ఖాతాల్లో రెండో విడతగా రూ.6,190 కోట్లు జమ చేసింది. తొలి విడతలో 11.34 లక్షల మంది రైతులకు రూ.6,035 కోట్లు విడుదల చేశారు. ఇప్పటి వరకు 17.75 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరింది. రెండు దశల్లో కలిపి రైతుల ఖాతాల్లో రూ.12,225 కోట్లు జమ చేశారు.

## పెన్షన్ జాప్యంపై సుప్రీం కోర్టు ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

నవంబర్ 14లోగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించింది. లేదంటే పెన్షన్ పెంపుపై తామే ఆదేశాలు ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించింది. పదవీవిరమణ పొందిన అధికారుల పింఛనుకు సంబంధించి నెలకొన్న సమస్యలపై దాఖలైన పిటిషన్లను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం విచారించింది. ఈ క్రమంలో ఏళ్లతరబడి ప్రభుత్వం ఓ నిర్ణయానికి రాకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఎన్నాళ్లు ఇది కొనసాగుతుంది? 2021 నుంచి ఈ వ్యవహారంపై చర్చ జరుగుతోంది. అయినా నిర్ణయం తీసుకోలేదు' అని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. నవంబర్ 14లోగా తుది నిర్ణయం తీసుకోకుంటే రిటైర్డ్ రెగ్యులర్ కెప్టెన్లకు 10శాతం పెన్షన్ పెంచేలా తామే ఆదేశాలు ఇస్తామని హెచ్చరించింది. కేంద్రం తరఫున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భట్టీ వాదిస్తూ.. "క్షమాపణలు మాత్రమే చెప్పగలను. మాకు మరో అవకాశం ఇవ్వండి. ఈ విషయంపై నిర్ణయం తీసుకుంటాం. మూడు నెలల గడువు ఇవ్వండి" అని విజ్ఞప్తి చేశారు.

# ఝార్ఖండ్‌లో రైలు ప్రమాదం

- పట్టాలు తప్పిన ముంబయి హావ్‌డా ఎక్స్‌ప్రెస్
- ఇద్దరు మృతి. 20 మంది తీవ్రగాయాలు

ముందడుగు ఝార్ఖండ్:

ఝార్ఖండ్‌లో రైలు ప్రమాదం జరిగింది. చక్రధర్‌పూర్ వద్ద ముంబయి-హావ్‌డా ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలానికి రైల్వే అధికారులు చేరుకున్నారు. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నారు.

జంషేడ్‌పూర్‌కు 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న బరంబంబూ ప్రాంతంలో తెల్లవారుజామున 3.45 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రాంతంలో ఆగ్నేయ రైల్వే డివిజన్ కిందకు వస్తుంది. మొత్తం 18 బోగీలు పట్టాలు తప్పినట్లు ఎస్ఈఆర్ అధికార ప్రతినిధి చెప్పారు. సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. ప్రమాదం నేపథ్యంలో హావ్‌డా -టిట్లాగఢ్-



కాంటాబాంజీ ఇస్పత్ ఎక్స్‌ప్రెస్, హావ్‌డా-బార్బిల్ జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేస్తున్నట్లు ఎస్ఈఆర్ తెలిపింది. మరికొన్ని రైళ్లను దారి మళ్లించినట్లు వెల్లడించింది. ఘటనా స్థలానికి కొంతదూరంలో మరో గూడ్స్ రైలు కూడా పట్టాలు తప్పినట్లు అధికారులు తెలిపారు. ఈ రెండు ప్రమాదాలూ ఒకేసారి జరిగాయా అనే విషయంలో ఇంకా స్పష్టత లేదని చెప్పారు. అలాగే అక్కడ జరిగిన ప్రమాద తీవ్రతను కూడా ఇంకా అంచనా వేయాల్సి ఉందన్నారు.

ముందడుగు
బుధవారం, 31-07-2024, హైదరాబాద్

### కేరళకు స్టాలిన్ ప్రభుత్వం
# ఆపన్న హస్తం
## సీఎం నిధుల కింద రూ.5 కోట్లు విడుదల



ముందడుగు తమిళనాడు: ప్రకృతి విలయానికి అతలాకుతలమైన కేరళ రాష్ట్రానికి తమిళనాడు ప్రభుత్వం ఆపన్న హస్తం అందించింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్.. కేరళ రాష్ట్రానికి ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. సీఎం నిధుల కింద రూ.5 కోట్లు విడుదల చేయాలని అధికారులను స్టాలిన్ ఆదేశించారు. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి 63 మంది జలసమాధి అయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై స్పందించిన స్టాలిన్.. కేరళ సీఎం పినరయి విజయన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా మృతులకు సంతాపం ప్రకటించారు. ఈ కష్టకాలంలో తమిళనాడు ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సాయం చేస్తామని హామీ ఇచ్చారు.
ప్రకృతి ప్రకోపానికి గురై విలవిల్లాడుతున్న కేరళ ప్రభుత్వానికి సాయం చేసేందుకు ఇద్దరు ఐఏఎస్ కేడర్ల నేతృత్వంలో రెస్క్యూ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు సీఎం ప్రకటించారు. ఆ టీమ్‌ను కేరళకు పంపిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 10 మంది వైద్యులు, నర్సులతో కూడిన ఓ వైద్య బృందాన్ని కూడా కేరళ రాష్ట్రానికి పంపిస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు వయనాడ్ విలయంపై కర్ణాటక ప్రభుత్వం కూడా స్పందించింది. ఈ ఘటనపై ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ విపత్కర పరిస్థితుల్లో కేరళ రాష్ట్రానికి అన్ని విధాలా సాయమందిస్తామని హామీ ఇచ్చారు.

# భారత్ ఖాతాలో మరో పతకం
## సరబ్‌జోత్ సింగ్, మను బాకర్ జోడీకి కాంస్యం



ముందడుగు జాతీయం: భారత్ పారిస్ ఒలింపిక్స్‌లో మరో పతకం సాధించింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో సరబ్‌జోత్ సింగ్, మను బాకర్ జోడీ దక్షిణ కొరియాతో పోటీపడి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. మను బాకర్ జోడి 16 పాయింట్లు సాధించగా.. దక్షిణ కొరియా ద్వయం (లీ-యెజిన్) 10 పాయింట్లు సాధించింది. మను ఇప్పటికే వ్యక్తిగత విభాగం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో కాంస్య పతకం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో స్వాతంత్ర్యం తర్వాత ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన భారత అథ్లెట్‌గా ఆమె రికార్డు సృష్టించింది. భారతదేశం బ్రిటిష్ పాలనలో ఉన్నప్పుడు 1900 ఒలింపిక్స్‌లో బ్రిటిష్-ఇండియన్ అథ్లెట్ నార్మన్ ప్రిచర్డ్ అథ్లెటిక్స్‌లో రెండు రజత పతకాలు సాధించాడు.

### ఫిర్యాదుదారుల పట్ల
# మర్యాదగా ప్రవర్తించాలి

- వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ
- ములుగు జిల్లా ఎస్ పి డా.శబరిష్



ముందడుగు వెంకటాపూర్: ములుగు జిల్లా ఎస్ పి డా. శబరిష్ వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. తనిఖీలో భాగంగా స్టేషన్లోని రికార్డ్స్ ను పరిశీలించి కేసుల నమోదు వాటి యొక్క స్థితి గతులను తెలుసుకుని పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. బాధిత వ్యక్తుల నుంచి ఫిర్యాదును స్వీకరించిన అనంతరం వారికి వెంటనే రసీదు అందించాలని ఎఫ్ ఐ ఆర్ ను నిష్పక్షపాతంగా నమోదు చేయాలని రిసెప్షన్ డ్యూటీస్ లో ఫిర్యాదుదారుని పట్ల మర్యాదగా ప్రవర్తించాలని పోలీస్ స్టేషన్ వస్తే న్యాయం చేకూరుతుంది అనే విధంగా పని చేయాలని అన్నారు. నేర పరిశోధనలో ఇన్వెస్టిగేటివ్ అధికారి సాక్ష్యాధారాలను సేకరించడంలో నైపుణ్యంగా వ్యవహరించాలని (గ్రామ పోలీసు అధికారి) గ్రామంలో గల ప్రజల సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు స్టేషన్ హౌస్ అధికారికి తెలియచేయాలని బాధిత వ్యక్తులు ఫిర్యాదు నిమిత్తం పోలీస్ స్టేషన్ వస్తే వారి సమస్యను విని వారికి న్యాయం చేస్తాం అనే నమ్మకం కలిగేలా ప్రవర్తించాలని ఎస్పీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ రవీందర్, సిఐ శంకర్, ఎస్ఐ సతీష్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

### సిగ్గుతో తలదించుకోవాల్సిన
# పరిస్థితి..!
## అత్యాచార ఘటనలపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం..



ముందడుగు హైదరాబాద్: రాష్ట్రంలో జరుగుతున్న వరుస అత్యాచార ఘటనలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకే రోజు రాష్ట్రంలో నాలుగు అత్యాచారాలు జరుగడం బాధాకరమన్నారు. సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. మహిళలకు భద్రత కరువైందని, పెరిగిన అత్యాచారాల గురించి అసెంబ్లీలో మాట్లాడి 48గంటలు కూడా కాలేదన్నారు. చట్టాలు చేసే అసెంబ్లీలో మనం ఉండి ఎందుకనే స్వీయ ప్రశ్న వేసుకోవాల్సిన తరుణమన్నారు. మహిళా భద్రతకు చిరునామాగా ఉన్న తెలంగాణలో ఇలాంటి ఘటనలు వరుసగా జరగటం ఆందోళనకరమన్నారు. వనస్థలిపురం పీఎస్ పరిధిలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై సామూహిక లైంగిక దాడి, ఓయూ పీఎస్ పరిధిలో ప్రయాణికురాలిపై ఆర్టీసీ బస్సు డ్రైవర్ అఘాయిత్యం, నల్లొండ జిల్లా శాలిగౌరారంలో దివ్యాంగ మహిళపై లైంగిక దాడి, నిర్మల్ నుంచి ప్రకాశం వెళ్తున్న ట్రావెల్ బస్సులో మహిళపై డ్రైవర్ లైంగిక దాడి ఘటనలు జరిగాయన్నారు. బాధితులకు భరోసా కల్పించాలని.. నిందితులను గుర్తించి కఠిన శిక్ష పడేలా చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

### తాను బిఆర్ఎస్ పార్టీలోనే
# కొనసాగుతాను
## సొంత గూటికి చేరుకున్న గద్వాల ఎమ్మెల్యే




ముందడుగు హైదరాబాద్: గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తాను బిఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతానని కేటీఆర్‌కు చెప్పినట్లు తెలిసింది. రెండో విడత రుణ మాఫీలో కాంగ్రెస్ ఉండగా.. బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి షాకిచ్చారు. కేటీఆర్ సమక్షంలో ఆయన బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గులాబీ కండువా కప్పుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి కూర్చుని మాట్లాడారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరుతున్న వేళ.. బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సొంతగూటికి చేరుకోవడం చర్చనీయంశంగా మారింది. కృష్ణ మోహన్ రెడ్డి యూటర్న్ తీసుకోవడంతో అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 74 కు చేరింది. కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలేరు యాదయ్య, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఉన్నారు. త్వరలో మరి కొంత మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ చేరుతారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి యూటర్న్ తీసుకోవడం గమనార్హం. కృష్ణమోహన్ రెడ్డికి స్థానిక కాంగ్రెస్ నేతలతో పడకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. అయితే కేసీఆరే కావాలని బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కాంగ్రెస్‌లోకి పంపారని మరి కొందరు వాదిస్తున్నారు. ఇలా చేస్తే కాంగ్రెస్‌లోకి వలసలు తగ్గుతాయని ప్లాన్ చేసినట్లు చెబుతున్నారు.

ముందడుగు
బుధవారం, 31-07-2024, హైదరాబాద్

# 10 అడుగుల గదికి రూ.15 వేల ఇంటి అద్దె

- ఒకరు పడుకుంటే మరొకరు బయట ఉండాలి
- ఢిల్లీలో సివిల్స్ విద్యార్థుల దీన దుస్థితి..!




ముందడుగు ఢిల్లీ:
చాలా మంది యువతీ, యువకుల తాను కలెక్టర్ కావాలని, పెద్ద పోలీస్ ఆఫీసర్ అవ్వాలని కలలుగంటారు. అందుకు గ్రామాలను, అందరిని వదిలి తమ లక్ష్యం కోసం దేశ నలుమూలల నుంచి దేశ రాజధాని ఢిల్లీకి వచ్చే వారు ఉన్నారు. విద్యార్థుల అవకాశాన్ని అలుసుగా తీసుకుంటున్న ఆ ప్రాంతం వారు విపరీతంగా అద్దెలు, ఇతరత్రా రేట్లు పెంచుతున్నారు. ఢిల్లీలో సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న ఓ విద్యార్థి గది తాజాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

కేవలం 10 అడుగుల పొడవు, వెడల్పు కలిగిన గదిలో ఓ విద్యార్థి సివిల్స్‌కు సన్నద్ధమవుతున్నాడు. ఒక టేబుల్, కొన్ని పుస్తకాలు, ఒక కుర్చీ, నడవడానికి కాస్త స్థలం మాత్రమే ఉంది. లోపల ఒకరు ఉంటే మరొకరు కాసేపు ఉండేందుకు చోటు కూడా లేని పరిస్థితి. దుస్తులను కూడా లోపలే ఆరబెట్టుకోవాల్సిన దుస్థితి. ఈ ఇరుకుగదికి యజమానులు రూ.12 నుంచి రూ.15 వేల వరకు అద్దె వసూలు చేస్తున్నారు. ఏటా అద్దె పెరుగుతూనే ఉంటుంది. నగరంలోని చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇలాంటిచోట ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ విద్యార్థులు పరీక్షకు సన్నద్ధం అవుతున్నారు.

దీనికి సంబంధించిన వీడియోను డీఎస్పీ అంజలి కటారియా ఖాతాలో షేర్ చేశారు. విద్యార్థుల దుస్థితిపై ఆందోళన వ్యక్తంచేశారు. "10X10 చిన్న గదికి విద్యార్థులు రూ.వేలు చెల్లిస్తున్నారు. ఇంటి నుంచి దూరంగా ఉండాలని మాత్రమే దిల్లీకి రావొద్దు. మీ కుటుంబం డబ్బును వృథా చేయకండి. ఆన్‌లైన్ వీడియో ద్వారా ప్రిపేర్ అవడానికే విద్యార్థులు ఇంత మొత్తం చెల్లిస్తున్నారు. ఇది ఆలోచించాల్సిన విషయం" అని పోస్టు చేశారు.



# సొంతంగా డబ్బింగ్ చెప్పేసింది

సినిమా విడుదలకు ముందే స్టార్ స్టేటస్‌ని సొంతం చేసుకున్నది భాగ్యశ్రీ బోర్సే. ప్రస్తుతం ఈ అందాలభామ డేట్స్ కోసం నిర్మాతలు క్యూ కట్టారనేది ఫిల్మ్‌వర్గాల టాక్. రవితేజ హీరోగా హరీశ్‌శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'మిస్టర్ బచ్చన్' ద్వారా ఈ ముద్దుగుమ్మ కథానాయికగా పరిచయం అవుతున్న విషయం తెలిసిందే. ఆగస్ట్ 15న సినిమా విడుదల కానుంది. అందుకే మిగిలివున్న వర్క్‌ని చకచకా పూర్తి చేస్తున్నారు చిత్రబృందం. తాజాగా భాగ్యశ్రీ తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పేసుకొని తన బాధ్యతను పూర్తి చేసేసుకుంది. తన మాతృభాష తెలుగు కాకపోయినా కష్టపడి నేర్చుకొని తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పడంతో అందరూ భాగ్యశ్రీని అభినందనలతో ముంచెత్తుతున్నారు. ఆమె డెడికేషన్ని ప్రశంసిస్తున్నారు.




# మహిళలపై ఆగని అఘాయిత్యాలు

- కదులుతున్న బస్సులో మహిళపై అత్యాచారం
- సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌పై స్నేహితుల అఘాయిత్యం
- ఒకరోజు నగరంలో రెండు అమానుష ఘటనలు

**మహిళల భద్రతకు ఎన్ని చట్టాలు వచ్చినా, ఎంతోమందికి ఎన్నో శిక్షలు పడ్డ కొంతమంది రాక్షసుల్లో మాత్రం మార్పు రావడం లేదు. ఆడవారిపై అఘాయిత్యాలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. తెలిసిన వారితో, స్నేహితులతో ఎవరితో బయటికి వెళ్లాలన్న భయపడుతున్న రోజులు ఇవి.. ఎవరిని నమ్మాలో, ఎవరి మనసులో కామాంధుడు దాగి ఉన్నాడో తెలుసుకోలేక నిత్యం ఎంతోమంది అబలలు అఘాయిత్యాలకు గురవుతున్నారు.**



ముందడుగు క్రైం:
తెలంగాణ రాష్ట్రంలో మరో దారుణ ఘటన చోటు చేసుకుంది. కదులుతున్న బస్సులో మహిళను అత్యాచారం చేశారు. నిర్మల నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లాకు వెళుతున్న బస్సులో మహిళపై ఈ అఘాయిత్యం జరిగింది. నోట్లో గుడ్డలు కుక్కి డ్రైవర్ తనపై అత్యాచారం చేశాడని డయల్ 100 ద్వారా బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ సమీపంలో బస్సును ఆపి, సీజ్ చేశారు. బస్సులో ఇద్దరు డ్రైవర్లు ఉండగా.. వారిలో ఒకరైన సిద్దయ్యను అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న మరో డ్రైవర్ కృష్ణ (ప్రధాన నిందితుడు) కోసం గాలింపు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజేందర్ తెలిపారు.

## లేడీ టెక్కీపై స్నేహితుల అత్యాచారం

హైదరాబాద్ నగరంలో మరో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌పై స్నేహితుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన బాధితురాలి ఫిర్యాదుతో బయటపడింది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నగరానికికు చెందిన ఓ మహిళా సాఫ్ట్వేర్ ఇంజినీర్ తన స్నేహితులతో కలిసి ఓ హోటల్కు వెళ్లారు. మద్యం మత్తులో తన స్నేహితుడు మరో వ్యక్తితో కలిసి తనపై దారుణానికి ఒడిగట్టాడని మహిళ ఫిర్యాదులో తెలిపింది. దీంతో ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముందడుగు
బుధవారం, 31-07-2024, హైదరాబాద్




## బజాజ్ ఫైనాన్స్‌తో డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ భాగస్వామ్యం

ముందడుగు హైదరాబాద్: డైమ్లర్ ట్రక్ ఏజీ ("డైమ్లర్ ట్రక్") పూర్తి యాజమాన్య అనుబంధ సంస్థ డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్, బజాజ్ ఫిన్‌సర్వ్ గ్రూప్‌లో భాగమైన బజాజ్ ఫైనాన్స్‌తో ఒక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. తన వాణిజ్య వాహన వినియోగదారులు, డీలర్‌షిప్‌లకు భాగస్వామ్యం ఆర్థిక పరిష్కారాలను అందిస్తుంది. ఈ సహకారం డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ మొత్తం వాణిజ్య వాహన శ్రేణిలో ఫైనాన్సింగ్ ఎంపికల సౌలభ్యాన్ని, సౌకర్యాన్ని మెరుగుపరచే లక్ష్యాన్ని కలిగి ఉంది. డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ ప్రెసిడెంట్ మరియు చీఫ్ బిజినెస్ ఆఫీసర్ శ్రీరామ్ వెంకటేశ్వరన్ మాట్లాడుతూ, "బజాజ్ ఫైనాన్స్‌తో భాగస్వామిగా ఉండటం మాకు చాలా ఆనందంగా ఉంది.

ఇది మా వినియోగదారులకు మెరుగైన, ఆర్థిక పరిష్కారాలను అందించేందుకు మాకు వీలు కల్పిస్తుంది. అసాధారణమైన విలువ, మద్దతును అందించాలనే మా నిబద్ధతలో గణనీయమైన పురోగతిని సూచిస్తూ, ఉన్నతమైన టోటల్ కాస్ట్ అఫ్ ఓనెర్షిప్ ను అందించే డిఐసివి సామర్థ్యాన్ని ఈ సహకారం బలోపేతం చేస్తుంది అని వివరించారు.

## శ్రీశైలం జలాశయానికి భారీగా వరద..
# ఏడుగేట్లు ఎత్తివేత..

శ్రీశైలం : ఎగువ నుంచి శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం భారీగా పెరుగుతున్నది. దీంతో అధికారులు ఏడు క్రస్ట్‌గేట్లను 10 అడుగులమేర ఎత్తి సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. మంగళవారం జూరాల ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తి నుంచి 19,653 క్యూసెక్కులు, క్రస్ట్‌గేట్ల ద్వారా 2,61,543 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది. సుకేశుల నుంచి 1,07,246 క్యూసెక్కుల నీరు విడుదలై సాయంత్రానికి 3,88,460 క్యూసెక్కుల నీరు చేరుకోగా.. రిజర్వాయర్ నుంచి 4,13,178 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలైనట్లు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 883 అడుగులు ఉన్నది. పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 215 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 207 టీఎంసీలుగా ఉన్నది. కుడిగట్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి 25,684 క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి ద్వారా చేసి దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. మరో వైపు శ్రీశైలం జలాశయం డ్యామ్ గేట్లు ఎత్తివేయడంతో శ్రీశైలం రహదారులన్నీ పర్యాటకులతో సందడిగా



మారాయి. హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు శ్రీశైలం బాటపడుతున్నారు. మరో వైపు రిజర్వాయర్‌కు వరద పెరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందు జాగ్రత్తగా ఎవరూ వెళ్లొద్దని సీఐ ప్రసాదరావు హెచ్చరించారు. మంగళవారం ఉదయం టూరిజంశాఖ అధికారులకు, మత్స్యకారులకు నోటీసులు జారీ చేశారు. నీటి ప్రవాహం తగ్గే వరకు పడవలు నడపొద్దని సూచించారు.

# వీధికో ప్రయివేట్ ఆసుపత్రి..!

- వైద్యం అంతా కార్పొరేట్ చేతుల్లోనే
- హైదరాబాద్‌లో ప్రయివేట్ ఆసుపత్రులు 330
- యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆర్టీఐ సమాధానం




ముందడుగు ప్రత్యేకం: ఆనందంగా బతుకుతున్న ప్రతి మనిషి జీవితాన్ని ఒకేసారి తలకిందులు చేసేది ఆరోగ్యం.. హఠాత్తుగా ఆనారోగ్య సమస్య ఏర్పడితే ప్రాణాన్ని రక్షించుకోవాలని హడావుడిగా ఆసుపత్రివైపే బయలుదేరుతున్నారు.. ఈ మహానగరంలాంటి హైదరాబాద్‌లో ఎక్కడ, ఏ వైపు చూసినా ప్రయివేట్ ఆసుపత్రులే కనిపిస్తున్నాయి.. ప్రాణం మీద ఆశతో ప్రయివేట్ ఆసుపత్రిలో చేరి ఆస్తులన్ని అమ్ముకుంటున్నారు. హైదరాబాద్ నగరంలోప్రభుత్వ అనుమతి ఉన్న ప్రయివేట్ ఆసుపత్రులు ఎన్ని ఉన్నాయని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ తెలంగాణ వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని సమాచార హక్కు చట్టం ద్వారా ప్రశ్నించగా హైదరాబాద్ డిఎంహెచ్ఓ అందుకు సంబంధించిన సమాచారం ఇచ్చారు. ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందిస్తామనే ఆలోచన మాత్రం ప్రభుత్వాల్లో లేదు. ఎందుకంటే హైదరాబాద్ నగరంలో ప్రతి గల్లీకి ఒక ప్రయివేట్ ఆసుపత్రి ఉంది. తెలంగాణ రాష్ట్రంలోని ఒక హైదరాబాద్ నగరంలోనే ప్రభుత్వ అనుమతి తీసుకున్న ప్రయివేట్ కార్పోరేట్ ఆసుపత్రులు 330 ఉన్నాయని హైదరాబాద్ జిల్లా డిఎంహెచ్ఓ యూత్ ఫర్ యాంటీ కరప్షన్‌కు సమాచారం పంపారని సంస్థ పౌండర్ రాజేంద్ర పల్నాటి తెలిపారు.

**కొన్ని జిల్లాలలోని డిఎంహెచ్ఓలు పంపిన సమాచారం..**

### వరంగల్
వరంగల్ జిల్లాలో ప్రభుత్వ అనుమతి ఉన్న ప్రయివేట్ ఆసుపత్రులు - 105,
అందులో శస్త్ర చికిత్సలు అనుమతి ఉన్న అసుపత్రులు - 65

### మహబూబ్‌నగర్
మహబూబ్‌నగర్ జిల్లాలో అనుమతి ఉన్న ప్రయివేట్ ఆసుపత్రులు - 190
అందులో శస్త్ర చికిత్సలు అనుమతి ఉన్న ఆసుపత్రులు - 46

### పెద్దపల్లి
పెద్దపల్లిలో ప్రభుత్వ అనుమతి ఉన్న ఆసుపత్రులు - 115
శస్త్ర చికిత్సలు అనుమతి ఉన్న ఆసుపత్రులు - 36

### భద్రాద్రి కొత్తగూడెం
ప్రభుత్వ అనుమతి ఉన్న ఆసుపత్రులు - 153

### జగిత్యాల
జగిత్యాలలో ప్రభుత్వ అనుమతి ఉన్న ఆసుపత్రులు - 240

### సిద్దిపేట
సిద్దిపేట జిల్లాలో ప్రభుత్వ అనుమతి ఉన్న ప్రయివేట్ ఆసుపత్రులు - 137
శస్త్ర చికిత్సలు అనుమతి ఉన్న ఆసుపత్రులు - 70

### సూర్యాపేట
సూర్యాపేట జిల్లాలో ప్రభుత్వ అనుమతి ఉన్న ప్రయివేట్ ఆసుపత్రులు - 61

### వికారాబాద్
వికారాబాద్ జిల్లాలో ప్రభుత్వ అనుమతి ఉన్న ప్రయివేట్ ఆసుపత్రులు - 79
శస్త్ర చికిత్సలు అనుమతి ఉన్న ఆసుపత్రులు - 39

### ఖమ్మం
ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ అనుమతి ఉన్న ప్రయివేట్ ఆసుపత్రులు - 243
శస్త్ర చికిత్సలు చేసే ఆసుపత్రులు - 85

### జోగులాంబ గద్వాల
జోగులాంబ గద్వాల జిల్లాలో అనుమతి ఉన్న ప్రయివేట్ ఆసుపత్రులు - 41
శస్త్ర చికిత్సలు చేసే ఆసుపత్రులు - 26

### ఆసిఫాబాద్
ఆసిఫాబాద్ జిల్లాలో అనుమతి ఉన్న ప్రయివేట్ ఆసుపత్రులు - 50

### భూపాలపల్లి
భూపాలపల్లి జిల్లాలో అనుమతి ఉన్న ప్రయివేట్ ఆసుపత్రులు - 32